# వస్త్రసన్యాసిని కథ

ఎవరికైనా దేనిమీదైనా తగుమోతాదులో మోజు ఉంటే సరదా అంటారు ఇంకొంచెం మోజు ఉంటే ఇష్టం అంటారు మరికాస్త మోజు ఉంటే చాలా ఇష్టం అంటారు బాగా ఎక్కువుంటే పిచ్చి అంటారు పిచ్చి అనగా చాలాచాలా ఇష్టమని అర్థమన్నమాట ఈ అర్థంతో ఉపయోగించబడే పిచ్చి అనే పదం — సినిమా విషయంలో రామానికి వర్తిస్తుదిం రామానికి సినిమాలంటే ఎంత పిచ్చి అంటే—చాలా మంది మిత్రులు అతన్ని సినిమా బుల్లోడు అని పిలుస్తూంటారు

రామం వచ్చిన ప్రతి సినిమా చూడడు కానీ వచ్చిన ప్రతి తెలుగు సినిమా చూస్తాడు అందుక్కారణం భాషాభిమానం మాత్రం కాదు సినిమాలో ప్రతి డైలాగూ సన్నివేశమూ క్షుణ్ణంగా ఫాలో అయితే తప్ప అతనికి సినిమా చూసినట్లుండదు అందువల్ల ఇతర భాషా చిత్రాలు ఎప్పుడో గానీ చూడడు కానీ తెలుగు సినిమా మాత్రం ఒక్కొక్కటి ఒకసారి కంటె మించి చూస్తాడు అందుక్కారణం కూడా పైన చెప్పినదే ఎంతవాడైనా ఒకే ఒక్కసారి చూసి తెలుగు సినిమా డైలాగులు అర్థం చేసుకోవడం కష్టం అందులోనూ కమేడియన్లవి ఎవరో వెనకాల తరుముకువస్తున్నట్లు మాట్లాడే ఆ కమేడియన్లు నోరు విప్పగానే జనసందోహం ఆనందంతో చప్పట్లు కొట్టేస్తూంటారు చప్పట్లు లేనప్పుడే అర్థంకాని ఆ డైలాగులు—చప్పట్లుండగా అర్థమవుతాయా?

వచ్చిన ప్రతి సినిమానీ తొలిరోజునే చూసేస్తాడు రామం ఎందుకంటే ఈ రోజుల్లో సినిమా రెండోరోజు ఆడుతుందో లేదో చెప్పడం చాలా కష్టం వచ్చిన ఏ సినిమానైనా చూడడం పడకపోతే రామం బ్రతకలేడు బ్రతకడం కోసమే అతను సినిమా తొలిరోజునే చూసేస్తాడు తొలిరోజున ప్రేక్షకుల గొడవలో డైలాగులన్నీ అర్థం కావు కాబట్టి- రెండోసారి ఆ చిత్రాన్ని విధిగా చూస్తాడు ఆ తర్వాత అవసరాన్ని బట్టి మరికొన్ని సార్లు చూస్తూంటాడు

సినిమాలు మనలో జ్ఞానం పెంపొందించవు అనడానికి తార్కాణంగా-రామం అమాయకత్వం ఇన్ని సినిమాలు చూసేక కూడా తగ్గలేదు అందుకే అతనికి హరా

త్తుగా ఒకరోజు సినిమాలో దీపలక్ష్మి నృత్యం చూస్తుండగా చటుక్కున అని పించింది "పాపం—సినిమాలో అందరు నటులూ ఒంటినిండా దుస్తులు ధరిస్తే ఈ అమ్మాయికి సరైన బట్టలు లేవేమిటి?" అని అనిపించడమే తడువుగా అతనికి అనేక చిత్రాలు—ఇదివరలో చూసినవి చాలా గుర్తుకొచ్చాయి ఎందులోనూ దీపలక్ష్మి సరయిన బట్టలు కట్టుకున్నట్లు-గుర్తులేదు ఎప్పుడూ చాలీచాలని బట్టలే.


అతను లోతుగా ఆలోచించ సాగాడు దీపలక్ష్మి ఇప్పటికి చాలా చిత్రాల్లో నటించింది డబ్బు చాలానే సంపాదించి ఉండాలి అటువంటప్పుడు ఒంటికి సరిపడే బట్టలు ఎందుకు కొనుక్కోలేక పోతోంది? అందులోనూ ఆమెకట్టుకునే ఆ చాలీచాలని బట్టలైనా మంచివి కాదు—చీలికలూ, పేలికలూనూ

దీపలక్ష్మిగి తనకు తానై అటువంటి బట్టలు కోరి ధరిస్తుందని అతను అనుకోలేక పోయాడు అతని ఇంటికి అంతకు ముందురోజునే ఒక ముష్టిది వచ్చింది పాపం-దాని వంటమీద కూడా చాలీచాలని బట్టలు- అవీ చిరిగిపోయినవి తనకు చాలా జాలి కలిగింది తల్లి ఓ పనిపైసలివ్వబోతే వద్దని- "ఏదైనా పాతగుడ్డ ఉంటే ఇప్పించడమ్మగారూ- మీపేరు చెప్పి కట్టుకుంటాను-" అంది అతని తల్లి ఓ చిరుగులచీర- ఇది కట్టుకున్న కంటే మంచిదే- దానికిచ్చేసరికి అది ఎంతో సంబరపడి పోయింది దీన్నిబట్టి ముష్టివాళ్ళుకూడా- తిండికంటే-బట్టకు ప్రాధాన్యత నిస్తున్నారన్నమాట. అటువంటప్పుడు దీపలక్ష్మి

ఆలోచనల్లోపడి సినిమా చూడ్డం మరచి పోతున్నానని రామం గుర్తించాడు అయితే అప్పటి కతనా సినిమా చూడ్డం మూడోసారి తనకు డైలాగు అర్థం కాన్సీను ఇంకా చాలా ముందుంది అంత వరకూ సినిమా శ్రద్ధగా చూడకపోయినా ఫరవాలేదు అందుచేత రామం మళ్ళీ దీపలక్ష్మిని గురించి ఆలోచించసాగాడు అప్పుడతనికి తన తల్లి గుర్తుకొచ్చింది

రామం తల్లి సుభద్రమ్మగారి కూడా చీరలు కొనుక్కోవడం విషయంలో చాలా అశ్రద్ధ ఎన్నోసార్లు భర్త బలవంత పెట్టినా - 'ఎందుకండీ ఇప్పుడు - పెట్టె నిండా చీరలున్నాయిగదా- అంటుంది వాటిల్లో చాలా వరకూ చిరిగిపోయినవే అవిడెప్పుడూ చిరుగుల చీరలే ఇంట్లో కడుతూంటుంది రామం అవిణ్ణి వేళాకోళం కూడా చేసేవాడు చిరిగిన చీర యితేగానీ అమ్మకు కట్టుకున్నట్లుండదని- ఆ వేళాకోళం చేయడానికి ఒక చిన్న కారణముంది

ఒకసారి రామం తండ్రి సుబ్బారావుగారు-పండగ బట్టలు కొనడానికి ఇంటిల్లపాదినీ బట్టల కొట్టుకు తీసుకెళ్ళారు అందరి సెలక్షన్లూ త్వరత్వరగా అయిపోయాయి కానీ సుభద్రమ్మగారి సెలక్షన్ ఓ పట్టాన అవ్వలేదు అతి కష్టంమీద ఆవిడకు నచ్చిన చీర దొరికింది ఇంటికి వచ్చి చూసుకుంటే పవిటంచు ప్రాంతంలో ఆ చీరకు చిన్న చిరుగుంది సుబ్బారావుగారు షాపువాడికి తిరిగిచ్చేద్దామన్నారు కానీ సుభద్రమ్మగారు ఒప్పుకో



లేదు " రెండుగంటలసేపు వెతగ్గా దొరికింది మళ్ళీ ఇంత మంచి చీర దొరుకుతుందేవిటీ? చీరన్నాక ఈవేళ కాకపోతే రేపైనా చిరగవలసిందే- ఉండనిద్దురూ-" అంది అసలు చిరుగుండడం వల్లనే ఆ చీర ఆవిడకు నచ్చిందని మిగతా అందరూ అనుకున్నారు

దీన్నిబట్టి అసలు ఆడవాళ్ళు చిరుగుల చీర కట్టడంలో ఒక ఆనందముందేమోనని రామం అనుకున్నాడు అయితే అది నిజంకాదు ఎతని అక్కలుగానీ చెల్లెలుగానీ బట్టకు చిన్న చిరుగుంటే దాన్ని ముట్టకోరు దీన్ని బట్టి ఒకవేళ దీపలక్ష్మిదీ, అమ్మదీ ఒకరకం మనస్తత్వమా అనుకుందామన్నా- కుదరలేదు ఎంత చిరుగుల చీర కట్టినా- చిరుగు కనపడనీయదు అమ్మ అంత నేర్పుగా కడుతుంది మరీ పెద్ద చిరుగుంటే కుడుతుంది దీపలక్ష్మి అటువంటి ప్రయత్నాలు చేసినట్లు కనబడదు బట్టలకు ఉన్న చిరుగులు కనబడడానికే బట్ట కుట్టినట్లు మసుల్తుంది ఆమె

అంతేకాదు- అమ్మలా ఆమె సిగ్గుపడదు వంటిమీద సరైన బట్టలేదే అన్న బాధలేకుండా- "మజా చేయవోయ్ రాజా!" అంటూ ఎగిరి గంతులువేసి పాట పాడుతుంది

అప్పుడే రామానికి ఓ అద్భుతమైన అయిడియా తట్టింది దీపలక్ష్మికి ప్రొడ్యూసర్లు అన్యాయం చేస్తున్నారని అతనికి గ్రహింపయింది సాధారణంగా దీపలక్ష్మి చిత్రంలో పదిపదిహేను నిములకు మించి కనిపించదు అటువంటి అమ్మాయికి ప్రత్యేకంగా బట్టలు కుట్టించడానికి ఏ ప్రొడ్యూసర్ సిద్ధపడతాడు? అందుచేత హీరోయిన్లకీ, తదితర పాత్రధారులకీ వాడగా మిగిలిన గుడ్డ పేలికల్ని యథాతథంగా దీపలక్ష్మికి ఇస్తూండి వుండాలి ఇది నిజంగానే చాలాఅన్యాయం

రామానిక్కావాలసిన సీను వచ్చేయ

టంతో అతనింక దీపలక్ష్మిని గురించిన ఆలోచనలు మానుకుని శ్రద్ధగా సినిమా చూడసాగాడు ఆ తర్వాత అతను దీపలక్ష్మిని గురించి మరచిపోయాడు మర్నాడు తెల్లవారే వరకూ

మర్నాడు తెల్లవారగానే అతను ముఖం కడుక్కుని కాఫీతాగుతూ ఏదో సినిమాపత్రిక తిరగేస్తూండగా ఒకపేజిలో దీపలక్ష్మి త్రివర్ణ చిత్రం కనిపించింది అదే దీపలక్ష్మి చీలికపేలిక గుడ్డతో శరీరమంతా ఇంచుమించు కనబడేలా ఉన్న దీపలక్ష్మి। అతని కొక్కసారి రాత్రి తన కొచ్చిన ఆలోచనలన్నీ గుర్తుకొచ్చాయి ఒకసారి ఆ పత్రిక తిరిగేశాడు ఎక్కడేనా దీపలక్ష్మి గురించిన ప్రసక్తి వస్తుందేమోనని ప్రత్యేకించి ఆమె ప్రసక్తి ఏమీలేదు గానీ- సినిమాలలో అసభ్య వస్త్రధారణ గురించి ఒక పాఠకుడు పెద్ద ఉత్తరం రాశాడు ఆ ఉత్తరంలో దీపలక్ష్మితో సహా మరికొంత మంది తారల్ని అతను ఏకి పారేశాడు

ఆ ఉత్తరం రామానికి నచ్చలేదు। దీపలక్ష్మిది అసభ్య వస్త్రధారణ ఎలాగవుతుంది? అసభ్యంగా ఉన్నదేదీ సినిమాలో ఉంచకుండా సెన్సార్‌బోర్డు ఉంది ఆమె వస్త్రధారణను సెన్సార్‌బోర్డు ఆమోదించింది, అంటే అసభ్యం కాదన్నమాటే గదా। అదీకాక దీపలక్ష్మికి మంచి పేరు ఉంది ఆమె నృత్యం ఉన్న సినిమాలను ప్రజలు విరగబడి చూస్తారు ప్రత్యేకించి ఆమె నృత్యం గురించే సినిమాకు వెడుతుంటామని కొంతమంది మిత్రులు అతనితో అన్నారు కూడా ఆమె వస్త్రధారణ అసభ్యమైనదైతే—తన స్నేహితులంత బహిరంగంగా చెప్పగలిగి వుండేవారు కాదు అంతేకాదు- దీపలక్ష్మి బొమ్మలు చాలా వాల్‌పోస్టర్లమీద వుంటాయి చాలా పత్రికల్లో వుంటాయి దీపలక్ష్మి వున్న సినిమాలు కొన్ని తాము కుటుంబంతో సహా చూశారు వీటన్నిటినీబట్టి చూస్తే దీపలక్ష్మి వస్త్రధారణ అసభ్యంగా లేదని తెలిసిపోతుంది ఒకవేళ అది అసభ్యమైతే అది ఆమె తప్పుకాదు ఆమె దర్శక నిర్మాతలు చెప్పినట్లు చేస్తోంది వాళ్ళు ఒద్దు మొర్రో అంటే కాదని ఆమె బట్టలు చింపుకోవడంలేదు వాళ్ళే ఆమెకు చీలిక పేలిక బట్టలిస్తున్నారు

రామానికి తన తాతగారి దగ్గర చనువెక్కువ ఎటువంటి సందేహమైనా ఆయన్నగడాని కతను సందేహించడు ఆయన మంచి చమత్కారి రామం సందేహం విని ఆయన నవ్వి—"గొప్ప సందేహం కలిగిందిరా దీనికి నీకు కారణం ఈ జన్మలోదికాదు క్రితం జన్మలో దీపలక్ష్మి మహా పతివ్రత భర్తకు తప్ప తన శరీరం ఎవరికీ కనబడకుండా వుండడానికి ఆమె శరీరమంతా బట్టలు కప్పుకునేది ముఖంమీద కూడ మేలి ముసుగు వేసుకునేది ఇలా ఎంతో జాగ్రత్తగావుండే ఆమె ఇంటికో దూర్వాసుడి వంటి ముని అతిథ్యానికొచ్చాడు—వంటచేయడానికి మడిబట్టలు కట్టుకోబోయిన ఆమె తన పొరబాటును గ్రహించింది అన్నిబట్టలూ మడికి ఆరవేసుకుంది గానీ—మేలి ముసుగు మాత్రం మరచి

పోయింది శరీరం ఏమాత్రమూ పరపురుషుడికి కనిపించకూడదని ఆమె నియమం కాబట్టి మేలి ముసుగు కూడా అరవేసుకుని తయారయ్యేసరికి కొంచెం ఆలశ్యమైంది ఆలశ్యానికి మునికి చాలా ఆగ్రహం వచ్చింది ఆయన దివ్యదృష్టితో జరిగినది గ్రహించి—"దేవతా సమానుడనైన నన్ను పరపురుషుడిగా భావించి అవమానించేవు ఏశరీరాన్నైతే నీవు పరపురుష దుర్నిరీక్ష్యంగా ఉంచాలనుకున్నావో—ఆ శరీరమే ప్రతి పురుషుడి కంటికీ నీ తర్వాతి జన్మలో విందుచేయుగాక—" అని శపించి వెళ్ళిపోయాడు ఆ శాప ఫలితంగానే దీపలక్ష్మి ఇప్పుడిలా సినిమా నృత్యాలు చేస్తోంది।" అన్నాడు

రామం కథ విన్నాడు కానీ నమ్మలేదు అతనికి పూర్వజన్మలమీదా, ఋషులమీదా శాపాలమీదా అంత నమ్మకంలేదు ఆ సాయంత్రమే అతను తన స్నేహితుడితో ఆరోజే రిలీజయిన ఓ తెలుగు సినిమాకి వెళ్ళాడు సినిమా ప్రారంభమైన అరగంటకు—మొట్టమొదటసారిగా రామానికి కనులవిందుచేస్తూ నిండైన దుస్తుల్లో దీపలక్ష్మి కనిపించింది అతను చాలా సంబరపడ్డాడు ఇన్నాళ్ళకు దీపలక్ష్మికి సినిమారంగంలో సరైన గుర్తింపు లభించింది అనుకున్నాడతను సన్నని మేలి ముసుగు వెనుక మెరిసిపోతున్న ఆమె ముఖంవంక ఆనందంగా చూశాడతను

దీపలక్ష్మి వయ్యారంగా నడుచుకుంటూ




వచ్చింది అది ఒక హోటల్—వేదిక దానిమీద ఆమె నిలబడివుంది అంతా నిశ్శబ్దం నెమ్మదిగా దీపలక్ష్మి తన మేలి ముసుగు తొలగించి —"నాపేరు రంగేళీ రాణి" అంది సన్నటి కంఠంతో ఆయాస పడుతున్నట్లు ఒక్కసారిగా సంగీతం పెద్ద ధ్వనిచేసింది ప్రేక్షకుల్లో ముందు బెంచీనుంచి ఎవరో ఈలకొట్టేరు

అంతవరకూ నెమ్మదిగా వున్న దీపలక్ష్మి నృత్యం ప్రారంభించింది అద్భుతంగా శరీరాన్ని కదిలిస్తూ—శరీరంమీంచి ఒక్కొక్క వస్త్రాన్నే తీసి పారేయడం మొదలు పెట్టింది పక్కనున్న స్నేహితుడు రామం చేయిగట్టిగా పట్టుకొన్నాడు ఆ చేయి వేడిగావుంది పాట, నృత్యం పూర్తయ్యేసరికి దీపలక్ష్మి -చిన్నడ్రాయర్ బ్రాలతో మిగిలింది ఆ దృశ్యం అక్కడితో ఆగిపోయింది రామం మనస్సు పాడయింది

దీపలక్ష్మి ఎందుకిలా చేసింది? ఇంత మంది మగవాళ్ళముందు ఆమె అలా బట్టలు విప్పడానికి కించపడలేదేం? రెండేరెండు సమాధానాలు వెంటనే లభించాయతనికి మొదటిది దీపలక్ష్మికి ఒంటినిండా బట్టలుంచుకునే అలవాటుపోయింది అలవాటు లేనిపని ఎవరికయినా చిరాగ్గానే వుంటుంది గుమ్మందాటితే చొక్కాలేకుండా కదలని తనకు—ఇంట్లో వుండగా చొక్కా వేసుకోవడం తగని చిరాకు ఇంట్లో వుండగా ఎవరయినా స్నేహితులు వస్తే—చొక్కా వేసుకుని వెళ్ళి కబుర్లుచెప్పి — స్నేహితుడు వెళ్ళిపోయిన వెంటనే చొక్కావిప్పి పారేస్తాడు తను దీపలక్ష్మికూడా అంతే అయుంటుంది కాకపోతే ఆమె అలా ప్రవర్తించడం చాలామందికి యిష్టం అయుండడం రెండవకారణం కావచ్చును ఇదికూడా చాలా సబబైన కారణం అనిపించిందతనికి

రామం మరీ అంత పసిబాలుడు — దీపలక్ష్మి నృత్యాలు ప్రేక్షకులని బాగా రంజింప చేయడానికి కారణం—ఆమె బట్టలు తక్కువగా ధరించడమేనన్న విషయం అతనికి తెలియకపోలేదు శరీరాలు వేడెక్కించుకోవడం కోసమే జనం ఆమె నృత్యాలు చూస్తున్నారనీ తెలుసు అయితే సినిమా నటీమణులందరూ అటువంటి నృత్యాలు చేయడంలేదు దీపలక్ష్మి దీపకుమారి దీపశ్రీ దీపలతవంటి కొంతమంది మాత్రమే సిగ్గువిడిచేశారు ఈ నలుగురిలోనూ దీపలక్ష్మికి మాత్రమే శిల్పంలాంటి అంగసౌష్టవం చక్కగా నృత్యాలు చేయగల నేర్పూ ఉన్నాయి మిగతావాళ్ళు కేవలం గంతులు వేస్తారు

ప్రేక్షకులిటువంటి నృత్యాలు కావాలని ప్రత్యేకంగా కోరలేదు వాళ్ళు కోరినది కనులకింపైన చిత్రం విసుగు కలిగించని చక్కని చిత్రాలను సాధారణంగా వాళ్ళాదరిస్తారు అయితే అటువంటి చిత్రాలని తీయడానికి నిర్మాతలకూ, దర్శకులకూ శక్తి సామర్థ్యాలుండాలి ఆ సామర్థ్యం లోపించినవాళ్ళు సినిమాల్లో చౌకబారు శృంగారాన్ని ప్రవేశపెడతారు చూడ్డానికి ప్రేక్షకులకి అభ్యంతరంలేదు, అసహ్యించుకున్నా, తిట్టినా చౌకబారు శృంగారం మానసికాహ్లాదాన్ని కలిగిస్తుందనడంలో సందేహంలేదు అందుచేత




ప్రేక్షకులు చూస్తారు దాన్నే ప్రేక్షకుల అభిరుచిగా భావించి నిర్మాతలు తమ తదుపరి చిత్రాల్లో మరింత శృంగారం యిరికిస్తారు కానీ అదివారి చేతకానితనం అనడంలో సందేహంలేదు

అదిసరే—నిర్మాతలు చూపించదల్చుకున్న శృంగారాన్ని అమల్లో పెట్టడానికి అందుకంగీకరించే ఆడపిల్లలు కావాలి డబ్బు ప్రధానం అనుకునేవాళ్ళూ, పేరు ప్రధానం అనుకునేవాళ్ళూ నటన, నాట్యంలో ఏమీ ప్రవేశం లేనివాళ్ళూ—మాత్రమే ఇటువంటి దానికి ఒప్పుకుంటారు అందమైన శరీరాన్ని ఎరగా చూపించి డబ్బు చేసుకోవడం నటనకాదు—వ్యభిచారమవుతుంది

దీపలక్ష్మి నృత్యంలో నేర్పరి అభినయంలో ఫరవాలేదు చక్కని భరతనాట్యాలు చేస్తే ఓహో అనిపించుకోగలదు కానీ మామయ్యా అంటూ కాలెగరేసి నలుగురిలోనూ చవకయిపోతుంది

బాగా ఆలోచించి రామం దీపలక్ష్మికొక ఉత్తరం రాశాడు "నేను మీ అభిమానిని మీరు అసభ్య నృత్యాలుచేసి నాకు చాలా బాధకలిగిస్తున్నారు-మానేయకూడదా—" అని దానికి జవాబు వచ్చింది "ఐదేళ్ళక్రితం దీపసుందరి తనింక అసభ్య నృత్యాలు చేయననీ, హీరోయిన్ వేషాలే వేస్తాననీ ప్రకటించింది ఫలితం ఏమిటి—మావంటి కొత్త వాళ్ళకు అవకాశం లభించింది జనం మాకు బాగా అలవాటు పడ్డారు నాలుగైదు సినిమాల్లో హీరోయిన్ వేశాక దీపసుందరికి మళ్ళీ అవకాశం రాలేదు నృత్యాలు చేస్తానంటున్నా ఆమెకు అవకాశం దొరకడంలేదు ప్రేక్షకులామెను మరచిపోయారు నిర్మాతలు మరచిపోతున్నారు ఆ గతి నేను పట్టించుకోదల్చుకోలేదు మీ అభిమానానికి నా కృతజ్ఞతలు నేను నాకు నచ్చే నృత్యాలు మాత్రమే చేస్తున్నాను

ఆ జవాబు రామానికి ఆశ్చర్యం కలి

గించింది. అందులోని విషయానికికాదు. ఆశ్చర్యం కలుగుట—ఆమె తీరుబడి చేసుకొని తనకంత వివరంగా ఉత్తరం రాసినందుకు

రామం సినిమాలూ, వాటిలో దీప లక్ష్మి నృత్యాలు చూస్తూనేవున్నాడు. కల వర పడుతూనే వున్నాడు ఏమైనా దీప లక్ష్మిని మార్చాలని అతని సంకల్పం. అటువంటి సందర్భంలో ఒక రోజున ఏదో పురాణపుస్తకం తిరగేస్తుండగా— "కలియుగంలో నిశ్చలమనస్కుడై మూడు సార్లు రామజపం చేస్తే దేముడు ప్రత్యక్ష మౌతాడు—" అని కనిపించింది ఆరోజు రాత్రి అంతా పడుకొన్నాక దేవుడి గది లోకివెళ్ళి రామం నిశ్చల మనస్సుకోసం అరగంట తంటాలుపడి చివరికి ఎలాగైతే నేమి దైవ సాక్షాత్కారాన్ని పొందాడు. అచ్చు ఎన్టీ రామారావులావున్న విష్ణు మూర్తికి రామం నమస్కారంచేసి దీప లక్ష్మి గురించి చెప్పాడు. భగవంతుడు మదహాసంచేసి—"నాయనా! దీపలక్ష్మి ప్రగతికి గుర్తు భారతనారి తరతరాలుగా పురుషుడికి బానిసగా వుంటూ వచ్చింది. ఆమె సౌందర్యాన్ని చాలాకాలం బట్టల్లో దాచేసాడు ఎక్కువబట్ట ధరించడందాస్యా నికి నిదర్శనం తక్కువబట్ట ధరించడం స్వాతంత్ర్యానికి చిహ్నం. ఈ స్వాతం త్రాన్ని మరింత బాహాటంగా ప్రదర్శిం చడం కోసం—దీపలక్ష్మి వస్త్రసన్యాసం చేసింది ఇప్పుడు పురుషులామెకుదాస్యం చేస్తున్నారు. పురుషులను దాసులుగా చేసు కోడానికి వస్త్ర సన్యాసమనే అద్భుతమైన ప్రక్రియను కనిపెట్టిన ఆమెను నేనుకూడ అభినందించకుండా ఉండలేను. ఆమె సినిమాలు నేనుకూడా చూశాను. నేనూ ఆమెకు దాసుణ్నే — అయితే ఆమెను మార్చాలని నీకుంటే ఒక్క ఉపాయము ఉంది సోదర భావంతో ఆమెకు రెండు నిండైన చీరలు కొని ఇయ్యి చాలు ఆపైన నీ అదృష్టం!"

రామం భక్తి పారవశ్యంతో కళ్ళు మూసి తెరిచేసరికి - ఎన్.టి. రామారావు మాయమైపోయాడు. ఇది కలా, నిజమా అని ఒక్కక్షణం తటపటాయించాడు రామం. కానీ దేవుడి కంఠం అతని చెవులో ఇంకా మారుమ్రోగుతూనేవుంది. ఆలోచిస్తూనే అక్కణ్ణించి వెళ్ళి పడు కున్నాడు రామం.

ఆ తర్వాత వారం రోజులాగి-కొత్తా కొట్లో రెండు మంచి చీరలు కొనుక్కుని- తల్లి దగ్గర బెలిపించి డబ్బులాగి-మద్రాసు ప్రయాణం కట్టాడు రామం. మద్రాసులో దిగగానే ఆ నగర సౌందర్యం చూసి పరవశించలేదతను. అక్కడి వింతలు చూడాలనికూడా అనుకోలేదు దీపలక్ష్మి ఇల్లెక్కడో వాకబుచేశాడు. తిన్నగా అక్కడికే వెళ్ళాడు అతని అదృష్ట వశాత్తూ-దీపలక్ష్మి ఆరోజు ఇంట్లోనే వుంది అతనికి ఆమె దర్శన భాగ్యం సులువుగానే లభించింది

"ఎవరు మీరు?" దీపలక్ష్మి ప్రశ్నిం చింది.

"మీ అభిమానిని. ఇదివరలో ఒక ఉత్తరం కూడా రాశాను దానికి మీరు జవాబు కూడా ఇచ్చారు. నాపేరు రామం" అన్నాడు రామం.

"మద్రాసు దేనికి వచ్చారు సినిమాలో ఛాన్సుకోసమా?"

"కాదండీ — కానేకాదు కేవలం మిమ్మల్ని చూడాలని వచ్చాను—"

"చాలా థాంక్స్-మరి చూశారుగా-"

"అవునండీ చూశాను నాకు చాలా సంతోషమైంది మీరు కూడా చీరలు కడతారనీ, కట్టి శరీరంమీద చాలాసేపు ఉంచుకుంటారనీ తెలుసుకున్నాను సినిమా దీపలక్ష్మికి మీకూ చాలా తేడావుంది ఆ తేడా ఇకముందు వుండకూడదని మీకోసం ఈ బహూవతి తీసుకొచ్చాను నన్ను మీ సోదరుడిగా భావించండి—" రామం పాకెట్‌ను అందించాడు

అతని మాటలకు దీపలక్ష్మి ముఖం కోపంగా అయిపోయింది ఆ కోపాన్ని ఆ పాకెట్ అందుకునే విసురులో చూపించింది అంత విసురులోనూ పాకెట్ విప్పింది అందులో రెండు చీరలు అందమైనవి వున్నాయి అంత కోపంలోనూ ఆమె ఆడమనసు ఆనందించకుండా ఉండలేకపోయింది "ఎందుకివి?" అంది అదో రకంగా అతనివంక చూసి

"కొంత కాలంపాటు మీరు సినిమాల్లో ఇలాంటి చీరలు కట్టుకోండి నలుగురిలోనూ బట్టలు విప్పకండి చిరుగుల బట్టలు కట్టుకుని సొంతకండి-ఇదీ ఈ సోదరుడి కోరికలు " రామం ఇంకా



ఏదో అనబోతూండగా — "యూఫూల్ గెటౌట్?" అంది దీపలక్ష్మి రామం కేవలం తన్నవమానించడానికే వచ్చినట్లు భావించిందామె ఏమనాలో తెలియక రామం తిరుగు ప్రయాణం పట్టాడు అతనికి మనస్సులో అసంతృప్తిగావుంది

ఇంటికి వెళ్ళేసరికి కొంచెం హడావుడిగా వుంది వ్యవహారం రామంగురించి ఇంట్లో తలోవిధంగా అనుకుంటున్నారు అతను షాపులో కాతాలో రెండు చీరలు తీసుకున్నట్లు తెలిసేక రామం ఏదో కాని పనిచేసి వుంటాడని ఇంట్లో అంతా భావించారు వాళ్ళందరికీ సమాధాన మిచ్చుకునేసరికి అతనికి తాతలు దిగివచ్చారు తండ్రి చేత బాగా చివాట్లుకూడా తిన్నాడు రామం

ఇంట్లో చీవాట్లు సంగతి అటుంచి— స్నేహితుల్లో కూడా అపహాస్యపాలు అయ్యేడు రామం మద్రాసువెళ్ళి ఏమీ చూడకుండా రావడం, దీపలక్ష్మిని కేవలం చూసి వచ్చేయడం-అతనుచేసిన క్షమించరాని మహాపరాధాలు

వీటన్నింటినీ రామం ధైర్యంగా సహించాడు కానీ అతను సహించలేని విషయం ఆ తర్వాత ఆర్నెల్లకు జరిగింది

అప్పుడే రిలీజైన ఓ కొత్త చిత్రంలో దీపలక్ష్మి నృత్యం రంగుల్లో చిత్రీకరించారు చిన్న బాడీ డ్రాయరూ తప్ప ఆమె శరీరంమీద ఏవిధమైన ఆచ్ఛాదనా లేదు గాలికి ఎగిరే రెండు పేలికలు మాత్రం ఆమె కాళ్ళను అప్పుడప్పుడు కప్పుతున్నాయి ఆ రెండు పేలికలూ— తను ఇచ్చిన చీర్లలో ముక్కల్లా కనిపించాయి రామానికి □


# శ్రీ బాలాజీ వైద్యశాల



సెక్సుస్పెషలిస్టు డా॥ పి కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద, ఫోన్ 551, తెనాలి (ఎ పి)

బ్రాంచి 9-డి, శివాజీ స్ట్రీటు, మద్రాసు-17

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం - రండి

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను